క్లుప్తంగా

ఒరిజనల్ సర్టిఫికెట్లు పోగొట్టుకున్న యువకుడు

పట్టణ పోలీసులకు ఫిర్యాదు

మంగళగిరి: ఓ యువకుడు తన విద్యాభ్యాసానికి సంబంధించిన ఒరిజనల్ సర్టిఫికెట్లు పోగొట్టుకుని పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన ఎం ఫార్మసీ విద్యార్థి అచ్చా మురళి ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎం ఫార్మసీ కోర్సు పూర్తి చేశాడు. ఈ క్రమంలో ఒరిజినల్ సర్టిఫికెట్ల కోసం ఈనెల 9వ తేదీన మంగళగిరికి వచ్చారు. సర్టిఫికెట్‌ల పని ముగించుకుని ఈనెల 10వ తేదీ బుధవారం రాత్రి తిరిగి హైదరాబాద్ బయలుదేరిన సందర్భంలో నగరంలోని మందాకిని బార్ సమీపంలో సర్టిఫికెట్లు కలిగిన నీలం రంగు బ్యాగు, సెల్‌ఫోన్, పర్సు పోగొట్టుకున్నాడు. ఆ బ్యాగులో 10వ తరగతి, ఇంటర్, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ మార్కు లిస్టులు, స్టడీ సర్టిఫికెట్లు ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్లు ఉన్నాయి. ఈ మేరకు శుక్రవారం బాధితుడు మురళి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

62మందికి కంటి పరీక్షలు



ఫిరంగిపురం: మండంలోని తక్కెళ్లపాడు గ్రామంలో శుక్రవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. 62 మందికి కంటి వైద్య నిపుణురాలు వై.రోజారాణి వైద్యపరీక్షలు నిర్వహించారు. వై.రోజారాణి మాట్లాడుతూ 40మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. 10మందికి కంటిచుక్కలు మందు వేసి ఉచితంగా మందులు అందజేశామన్నారు. మిగిలిన 12మందిని గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలకు కంటిశుక్లాల ఆపరేషన్లు చేయించుకునేందుకు సిఫారసు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద ఎం.ఈశ్వరరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామికి విశేష పూజలు

ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలో వేంచేసి ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో హనుమత్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి గణపతిహోమం, లక్ష్మీ హోమాలను వేదపండితులు దివి పవన్‌కుమార్ నిర్వహించారు. అనంతరం స్వామివారికి నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు అర్చకులు ప్రసన్నమూర్తి, పి.అజయ్‌బాబు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పూజల్లో అంజిరెడ్డి, బలరామిరెడ్డి, కోటిరెడ్డి దంపతులు పాల్గొన్నారు.

భూ రీ సర్వేపై గ్రామసభ

మేడికొండూరు: మండలంలోని డొకిపర్రు గ్రామ పంచాయతీ సచివాలయం వద్ద శుక్రవారం భూ రీసర్వే గ్రామసభ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మీ భూమి- మా హామీలో భాగంగా గ్రామంలోని రెవెన్యూ పరిధిలోని పొలాల రీ సర్వేను నిర్ణీత సమయంలో అధికారులు పూర్తిచేశారు. అందులో భాగంగా అధికారుల రీ సర్వేలో వచ్చిన కొలతల ఆధారంగా సంబంధిత రైతులకు గ్రామ సభ నిర్వహించారు. రీసర్వేపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని డెప్యూటీ తహసీల్దార్ కుంభా శ్రీనివాసరావు కోరారు. ప్రతి రైతుకు సంబంధించిన విస్తీర్ణంలో హద్దు రాళ్లు వేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్షా పథకంలో భాగంగా ప్రతి ఒక్క రైతు తమపొలం హక్కులు అంతర్జాలంలో నమోదు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మండ సర్వేయర్ సీహెచ్ జాన్ సుందరరావు, పంచాయతి సెక్రటరీ బందెల రమేష్, పలువురు సచివాలయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాలలో మేరీమాత విద్యార్థుల ప్రతిభ

తాడికొండ: ప్రభుత్వం విడుదల చేసిన సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాలలో తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ సిస్టర్ అల్ఫోన్సా, కరస్పాండెంట్ సిస్టర్ సోఫీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీరిలో నూతలపాటి నాగ పవన్ కుమార్ 481/500 మార్కులతో ప్రథమ, యడవల్లి లక్ష్మీనారాయణ 464/500 మార్కులతో ద్వితీయ, తల్లా నిషాంత్ 455/500 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతోపాటు నూరుశాతం ఉతీర్ణత సాధనకు కృషి చేసి ఉపాధ్యాయులను వారు అభినందించారు.

హామీలు నెరవేర్చడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త సురేష్‌కుమార్
- గుళ్లపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

మేడికొండూరు: ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోనిబ గుళ్లపాలెం గ్రామంలో శుక్రువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా జగనన్న కాలనీలో పర్యటించి మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసి నిర్ణీత సమయంలోపు పూర్తిచేయాలని అన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించేందుకు ప్రత్యేక నిధులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గ్రామాల్లో పర్యటిస్తుంటే మహిళల కళ్లలో ఆనందం కనబడుతుందని అన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి కటుంబం రూపురేఖలు మారాలంటే విద్యాప్రగతి తోనే సాధ్యమని, ప్రభుత్వం విద్యారంగానికి ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి కోట్లాది రూపాయలు నిధులు హెచ్చించడం జరిగిందని అన్నారు. భవిష్యత్తులో విద్య, వైద్య రంగాలు ప్రక్షాళన చేసి మెరుగైన సేవలు అందించడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అని అన్నారు. జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, సర్పంచ్ పి.వెంకటకృష్ణయ్య, కె.దాసు, ఎ.సంజీవరెడ్డి పాల్గొన్నారు.

యువత భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నదే లక్ష్యం

- సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్, పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి
- జాబ్‌మేళాకు విశేష స్పందన
- 220 మంది ఎంపిక



విద్యార్థులు, కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న సురేష్‌కుమార్, బత్తుల బ్రహ్మానందరెడ్డి

తాడికొండ: నిరుద్యోగ యువతీ యువకుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు పెద్దఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ముందుకెళుతున్నారని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్, పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. తాడికొండ బీఎస్ఎస్‌బీ డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి కల్పనా కార్యాలయం, డీఆర్డీయే శాఖల సౌజన్యంతో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాకు హాజరయ్యారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగాల భర్తీకి చొరవ తీసుకున్న సందర్భాలు లేవని, కానీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా రెండు లక్షలకు పైగా సచివాలయ ఉద్యోగాలు కల్పించడంతోపాటు మెగా జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు ఎంఎన్‌సీ కంపెనీల భాగస్వామ్యంతో గ్రామీణ ప్రాంతాల్లో జాబ్‌మేళాలు నిర్వహించడం ద్వారా ఇప్పటికే రాష్ట్రంలో పెద్దఎత్తున ఉపాధి కల్పన జరిగిందని అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు. జాబ్‌మేళాకు పెద్దఎత్తున యువత తరలివచ్చి సద్వినియోగం చేసుకోవడం సంతోషంగా ఉందని, ఉద్యోగావకాశాలు వచ్చిన యువకులు ఉన్నత ఆశయాలతో ముందుకెళ్లి కుటుంబాలకు భరోసాగా నిలవాలన్నారు. మొత్తం 15 కంపెనీలకు చెందిన ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్‌మేళాలో 725 మంది విద్యార్థులు హాజరు కాగా వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన 220 మంది విద్యార్థులు తక్షణ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మరో 236 మంది విద్యార్థులు ఆఖరి రౌండ్‌లో పాల్గొనాల్సి ఉందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు తాళ్ల శివనాగరాజు, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి తోకల నరసింహారావు, ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, మాజీ యార్డు చైర్మన్ అవుతు శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లంపాటి రాఘవరెడ్డి, జిల్లా ఉపాధి కల్పనాధికారి కె రఘు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రణయ్, మహాత్మా గాంధీ నేషనల్ ఫెలోషిప్ ఆవుగడ్డ ఫణీంద్ర నాయుడు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో బిక్కి శివరామకృష్ణ, ఏపీఎం సాంబశివరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

అటవీశాఖ జిల్లా అధికారి మహబూబ్ బాషా



పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయిస్తున్న అటవీశాఖ జిల్లా అధికారి మహబూబ్ బాషా

మంగళగిరి: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, జీవన విధానం మార్పులతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని అటవీశాఖ జిల్లా అధికారి మహబూబ్ బాషా అన్నారు. జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పర్యావరణ హిత జీవనశైలిపై శుక్రవారం నగరంలోని టెంపుల్ హిల్ ఎకోపార్క్‌లో వాకర్స్‌కు అవగాహన కల్పించారు. డీఎఫ్ఓ మహబూబ్ బాషా మాట్లాడుతూ పర్యావరణం ప్రమాదంలో పడే పరిస్థితి నెలకొందని, ఇందుకు ప్రధాన కారణం మన అలవాట్లే అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకర జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. మట్టి కుండలను వినియోగించాలని, సీజనల్‌గా లభించే పండ్లను తీసుకోవాలని సూచించారు. ఎల్ఈడీ బల్బులను వినియోగించడం ద్వారా విద్యుత్‌ను ఆదా చేసిన వారవుతారని అన్నారు. వ్యర్థాలను, ఈ-వ్యర్థాలను తగ్గించాలని, క్యారీ బ్యాగులకు బదులుగా క్లాత్ బ్యాగులను వాడాలన్నారు. ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల వాడకాన్ని నిలిపివేసి ఇంటిలోని వాటర్ బాటిల్‌లో తాగునీటిని తీసుకువెళ్లాలని తెలిపారు. దీని వల్ల పర్యావరణ పరిరక్షణతోపాటు ఆరోగ్యానికి కూడా భద్రత ఉంటుందని అన్నారు. రోటరీ క్లబ్ వంటి స్వచ్ఛంద సంస్థల సహకారంతో పర్యావరణ పరిరక్షణకై పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వాకర్ల చేత పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ శ్రీవిద్య, డిప్యూటీ రేంజర్ గిరిబాబులతోపాటు వాక్స్ అసోసియేషన్ సభ్యులు, ఏకో పార్క్ సిబ్బంది పాల్గొన్నారు.

కేఎల్‌యూ పరిశోధకుడికి ఎక్సలెన్స్ అవార్డు



డాక్టర్ షేక్ చాంద్‌బాషాను అభినందిస్తున్న ప్రొ చాన్సలర్ డాక్టర్ కె.ఎస్.జగన్నాధరావు

తాడేపల్లిరూరల్: కేఎల్ విశ్వవిద్యాలయం పరిశోధకుడికి ఎక్సలెన్స్ అవార్డు లభించిందని విశ్వవిద్యాలయ ప్రొ చాన్సలర్ డాక్టర్ కె.ఎస్.జగన్నాధరావు శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ న్యూఢిల్లీకి చెందిన ఫ్రెండ్‌షిప్ ఫోరమ్ అనే జాతీయ సంస్థ పరిశోధనా రంగంలో పలువురి పరిశోధనలు పరిశీలించి వాటిలో నుంచి అత్యుత్తమ పరిశోధనకు అవార్డు అందజేశారు. కేఎల్ విశ్వవిద్యాలయంలోని బయో టెక్నాలజీ విభాగంలో పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ ఫెలోగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ షేక్ చాంద్‌బాషాకు బెస్ట్ ఇండియన్ గోల్డెన్ పర్సనాలిటీస్ అవార్డును, అవార్డుతోపాటు బ్రాంజ్ మెడల్ కూడా అందజేసినట్లు తెలిపారు. డాక్టర్ చాంద్ బాషా పరిశోధన థీమ్ అల్జీమర్స్ (మతిమరుపు) వ్యాధి పాథోఫిజియాలజీ (ఎడి) అని, గతంలో డాక్టర్ చాంద్ బాషా ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సంస్థలు, ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ న్యూరో కెమిస్ట్రీ, ఇంటర్నేషనల్ బ్రెయిన్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ తమ జర్నల్‌కు అసోసియేట్ ఎడిటర్‌గా అవకాశాలు కల్పించి, అమెరికాలో జరిగిన సదస్సుకు చాంద్ బాషాను ఆహ్వానించారని తెలిపారు. డాక్టర్ చాంద్ బాషాను యూనివర్సిటీ చైర్మన్ కోనేరు సత్యనారాయణ, వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.ఎస్.జగన్నాధరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, పరిశోధనా విభాగ డీన్ డాక్టర్ జయకుమార్ సింగ్, బయో టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ గిరిధర్ తదితరులు అభినందించారు.

రాజరాజేశ్వరీదేవి అలంకారంలో అమ్మవారు



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసి ఉన్న మహంకాళీ అమ్మవారు శుక్రవారం రాజరాజేశ్వరి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంటకరెడ్డి మాట్లాడుతూ మహంకాళి అమ్మవారి 46వ ప్రతిష్ట వార్షికోత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయ అర్చకులు మహంకాళి అమ్మవారికి రాజరాజేశ్వరి అలంకారం గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

మెడ్ స్టార్ వైద్యులు విజయ్‌కుమార్



ఆరోగ్య సూత్రాలు వివరిస్తున్న మెడ్ స్టార్ వైద్యులు ఎస్. విజయ్‌కుమార్

తాడేపల్లిరూరల్: ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యంగా ఉండాలంటే శారీరక వ్యాయామం తప్పనిసరి అని మెడ్ స్టార్ వైద్యులు ఎస్. విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని జీసెస్ క్రైస్ట్ గ్లోరీ అండ్ కేర్ మినిస్ట్రీ ఆర్గనైజర్ పాస్టర్ మేరుగ అబ్రహం ఆధ్వర్యంలో ఆరోగ్య సదస్సును నిర్వహించారు. అబ్రహం మాట్లాడుతూ మన పెద్దలకు ఉన్న ఆరోగ్యం మనకు ఉండడం లేదని అన్నారు. సమయానికి మంచి శాఖాహారం, సరైన వ్యాయామం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. మనిషి ఆరోగ్యంగా జీవించాలంటే దురలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో సేవా భారత్ కో ఆర్డినేటర్ ఆనంద్ పాల్, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు తాడికొండలో విద్యుత్ సరఫరాకు ఆటంకం

తాడికొండ: నెలవారీ మరమ్మతులలో భాగంగా తాడికొండ మండలంలో శనివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ కోత విధించనున్నట్లు ఏఈ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానంగా అడ్డరోడ్డులోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, 33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహించనున్న కారణంగా విద్యుత్ కోత విధించనున్నారు. వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని కోరారు.

తుళ్లూరు మండలంలో...

తుళ్లూరు మండలంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ కోత విధించనున్నట్లు ఏఈఈ చిలక రాజు తెలిపారు. వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

- ఆటోలో బ్యాగ్ మర్చిపోయిన ప్రయాణికులు
- బ్యాగులో రూ.4లక్షల విలువైన బంగారు ఆభరణాలు
- ఆటో డ్రైవర్‌ను అభినందించిన పట్టణ సీఐ బి అంకమ్మరావు



సీఐ అంకమ్మరావు సమక్షంలో బాధితులకు బ్యాగు అందజేస్తున్న ఆటో డ్రైవర్ వెంకటేష్

మంగళగిరి: తన ఆటోలో ప్రయాణికులు పొరపాటున మర్చిపోయిన బ్యాగును ఆటో డ్రైవర్ పోలీసులకు అప్పగించి నిజాయితీని చాటుకున్నాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... బెంగళూరుకు చెందిన బురదగడ్డ సునీల్‌కుమార్ తన బంధువుల వివాహ వేడుకకు హాజరయ్యేందుకు ఈనెల 10వ తేదీన తన భార్యతో కలసి మంగళగిరి వచ్చారు. అనంతరం 11వ తేదీ విజయవాడ బెంజి సర్కిల్ వెళ్లేందుకు ఓ ఆటో మాట్లాడుకుని వెళ్లారు. ఈ క్రమంలో ఆటోలో వారు తమ వెంట తెచ్చుకున్న బ్యాగును మర్చిపోయారు. ఆటోలో ప్రయాణించిన దంపతులు బ్యాగును మర్చిపోవడాన్ని గమనించిన డ్రైవర్ జగన్నాథం వెంకటేష్ బ్యాగులోని ఐడీ కార్డు ఆధారంగా బురదగడ్డ సునీల్‌కుమార్‌కు ఫోన్‌చేసి విషయం చెప్పాడు. బ్యాగును మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. పట్టణ సీఐ బి అంకమ్మరావు బ్యాగును పోగొట్టుకున్న వారిని పిలిపించి ఆటో డ్రైవర్ జగన్నాథం వెంకటేష్ చేతుల మీదుగా శుక్రవారం బ్యాగు అందజేశారు. బ్యాగులో సుమారు రూ.4లక్షల విలువైన బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఆటో డ్రైవర్ వెంకటేష్ నిజాయితీని పట్టణ సీఐ బి అంకమ్మరావు, సిబ్బంది అభినందించారు.

బాధితులకు ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సాయం



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న ఎంపీపీ సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలంలో పలువురికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే ఆర్కే ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ నాయకులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్)లు బాధిత కుటుంబాలకు అందజేశారు. దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామానికి చెందిన ఆలూరి చిట్టియ్యకు రూ.15 వేలు, చిలువూరు గ్రామానికి చెందిన లోకం సావిత్రికి రూ.15 వేలు, ఇదే గ్రామానికి చెందిన చిలువూరు కోటయ్య కుటుంబానికి రూ.20 వేలు, దుగ్గిరాల గ్రామానికి చెందిన షేక్ నాగూర్ కుటుంబానికి రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజి, ఎంపీటీసీ సభ్యులు షేక్ సుభాని, సర్పంచ్‌లు ఉన్నం ఝాన్సీ, బానావత్ కుషీభాయి, వైఎస్సార్ సీపీ నాయకులు రాజేష్, వడ్డేశ్వరపు రజనీకాంత్, ఫిలోమినా బాబూ, వెంకటేశ్వర నాయక్, షేక్ బాజీ పాల్గొన్నారు.

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెంకు చెందిన షేక్ అక్బర్ అంత్యక్రియలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆర్థిక సాయం అందించారు. అలీ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి అంత్యక్రియల నిమిత్తం రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆ మొత్తాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు మృతుడి కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుండాల శ్రీనివాసరావు, పలగాని కోటేశ్వరరావు, దానబోయిన నాగయ్య, షేక్ షఫీ, ఎస్‌కే గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



వడ్డేశ్వరంలో తాగునీటిని సరఫరా చేస్తున్న కార్పొరేషన్ ట్యాంకర్

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో కార్పొరేషన్ ట్యాంకర్ల ద్వారా తాగునీటి శుక్రవారం సరఫరా చేశారు. వడ్డేశ్వరంలో ఈనెల 5వ తేదీన విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు రావడంతో తాగునీటిని సరఫరా చేసే రెండు మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. వెంటనే వాటికి మరమ్మతులు నిర్వహించారు. అయినప్పటికీ మరో మోటరు మొరాయించడంతో వడ్డేశ్వరం ఎస్సీ కాలనీలోని బిక్షాలు బావి వీధిలో తాగునీరు నిలిచిపోయింది. ఆ ప్రాంతానికి కార్పొరేషన్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. శనివారం ఉదయం మోటార్లు బిగించి తాగునీటిని పునరుద్ధరించనున్నట్లు వడ్డేశ్వరం ఇంజినీరింగ్ సిబ్బంది తెలిపారు.

కోనేరును అభివృద్ధి చేయాలి

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్



పనులు పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్

ఫిరంగిపురం: జలజీవన్ మిషన్ పనుల్లో భాగంగా కోనేరును అభివృద్ధి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఆర్. సురేష్ అన్నారు. మండలకేంద్రంలోని ఫిరంగిపురం తాగునీటి పథకం, వేములూరిపాడు చెరువుకట్ట ప్రాంతాల్లో జరుగుతున్న పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పనుల్లో భాగంగా ఫిరంగిపురానికి రూ.97లక్షలు, వేములూరిపాడు, అమీనాబాద్ గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల నిర్మాణం, గ్రామంలోకి పైపులైను ఏర్పాటు, ఇంటింటికి ఉచిత తాగునీటి కొళాయి ఏర్పాటు కోసం రూ.1.45లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. వేములూరిపాడు చెరువు ప్రాంతంలో పంచాయతీ నిధులతో నిర్వహిస్తున్న పిచ్చికంప తొలగింపు పనులను పరిశీలించినట్లు చెప్పారు. ట్యాంకు నిర్మాణానికి ఇప్పటికే అనువైన స్థలాలు ఉన్నాయని వాటిని పరిశీలించి త్వరితగతిన నిర్మాణ పనులు ప్రారంభించేలా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణ, ఏఈ వెంకటేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సాయిబాబు, సర్పంచులు మేడా బాబు, కె.చిన్న, గ్రామఅభివృద్ధి కమిటీ చైర్మన్ కె.ఆనంద్, ఈవో శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీ రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మోదుగుల శ్రీనివాసరెడ్డి, కాజా వెంకటేశ్వరరావులతో కలసి తాడేపల్లి మండల పరిధిలోని చిర్రావూరు, గుండిమెడ గ్రామాల్లో పర్యటించారు. వారు మాట్లాడుతూ ఈ ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రం లేకపోవడం వల్ల రైతులు రూ.1600లకే క్వింటా మొక్కజొన్నను అమ్ముకుంటున్నారని అన్నారు. గతంలో చిర్రావూరులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పిన వ్యవసాయ అధికారులు ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదని అన్నారు. తక్షణమే మొక్కజొన్న వేసిన రైతులకు ఆదుకునేందుకు కనీస మద్దతు ధర రూ.1962 కొనుగోలు చేయాలని కోరారు.

15లోపు పంట నష్టాన్ని నమోదు చేయాలి

తాడేపల్లిరూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన మొక్కజొన్న పంట అంచనాలను ఈనెల 15వ తేదీ లోపు పూర్తిచేయాలని దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులు, సచివాలయ రెవెన్యూ సిబ్బందితో ఆమె శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాల వల్ల నష్టపోయిన మొక్కజొన్న, జొన్న వివరాలు సేకరించాలని, పంట వేసిన రైతులు ఈనెల 15వ తేదీలోపు రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోదలచిన రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పుస్తకం, మొబైల్ నెంబర్‌లను రైతు భరోసా కేంద్రాల్లో అందజేయాలని అన్నారు.

వాలీబాల్ పోటీలకు రేవేంద్రపాడు విద్యార్థి ఎంపిక

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు జెడ్పీ పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయిలో జరిగే సబ్‌జూనియర్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గార్లపాటి సంతోష్ తెనాలిలో జరిగిన వాలీబాల్ ఎంపికలో జిల్లా నుంచి ఎంపికైన ఇద్దరిలో ఒకరని అన్నారు. ఈనెల 14వ తేదీ రాజమండ్రిలో జరిగే పోటీలలో పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థి సంతోష్‌ను, శిక్షణ ఇచ్చిన పీడీలు ఎం.రవి, డి.సుజాతలను సర్పంచ్ మేరమ్మ, విద్యాకమిటీ చైర్మన్ కొప్పుల ప్రకాశరావు తదితరులు అభినందించారు.

